
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
ఆదివారం 19 మే 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 25.0





జడ్చర్లలో ప్రధాన రహదారిపై పారుతున్న వర్షపు నీరు

భారీ వర్షం

- భూత్పూర్, జడ్చర్లలో రోడ్లన్నీ జలమయం
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పెంట్లవెల్లిలో అత్యధికంగా 68 మిల్లీ మీటర్ల వర్షపాతం
- జడ్చర్లలో కూలిన మార్కెట్ యార్డు గోడ
- భూత్పూర్‌లో విరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- పలు చోట్ల దెబ్బతిన్న వరి పంట.. కల్లాల్లో తడిసిన ధాన్యం



భూత్పూర్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీరు

మహబూబ్‌నగర్/మిడ్జిల్/భూత్పూర్/బాలానగర్/రాజాపూర్/నవాబ్‌పేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల, మే 18: మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం భారీ వర్షం కురిసింది. జడ్చర్ల, భూత్పూర్‌లలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లన్నీ నీటితో నిండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జడ్చర్లలో పలు ఇళ్లలోకి నీరు చేరింది. భూత్పూర్‌లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వరి పంట నేల వాలింది. నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లోనూ మోస్తరు వాన పడింది.

జడ్చర్ల అతలాకుతలం

జడ్చర్ల నియోజకవర్గంలోని జడ్చర్ల, మిడ్జిల్‌లలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జడ్చర్ల పట్టణంలోని నల్లకుంట అలుగుపారి నాగర్‌కర్నూల్‌కు వెళ్లే రోడ్డుపైకి నీళ్లు చేరాయి. దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వెంకటేశ్వర కాలనీ, సాయినగర్ కాలనీ, కావేరమ్మపేటతో పాటు నాలుగు, 11వ వార్డుల లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. వర్షం ఉధృతికి వ్యవసాయ మార్కెట్ యార్డు గోడ ఒక పక్క కూలిపోయింది. నాలాలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో పాటు, పలుచోట్ల నాలాలపై నిర్మాణాలు చేపట్టడంతో వర్షం పడిన ప్రతీసారి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్మాణంలో ఉన్న 167వ జాతీయ రహదారిపై నీళ్లు చేరడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జడ్చర్ల పట్టణంలోని 36.5 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, మిడ్జిల్ మండలంలోని 20.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పలుచోట్ల ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. జడ్చర్ల పట్టణంలో వర్షం కురిసిందంటే లోతట్టు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొందని, అధికారులు ఇకనైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీట మునిగిన రోడ్లు

భూత్పూర్ మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గాలితో కూడిన వర్షం పడటంతో చాలా గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్థంభాలు నేలకూలాయి. వరి, కూరగాయల పంటలకు అక్కడక్కడ నష్టం వాటిల్లింది. భూత్పూర్ చౌరస్తాలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మండలంలో సుమారు 12.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భూత్పూర్ చౌరస్తాలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతంలో ఉండేవారు జాగ్రత్తగా ఉండాలని, ఆయా వార్డుల్లో నిరంతరం పనిచేయడానికి ప్రత్యేక వార్డు అధికారులను నియమిస్తున్నట్లు కమిషనర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఏవైన ఇబ్బందులు ఉంటే వెంటనే మునిసిపల్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 9701652655కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సాగుకు రైతన్న సన్నద్ధం

వారం రోజుల్లో నైరుతి రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ చెప్పినట్లుగానే మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురవగా శనివారం కూడా పలు మండలాల్లో మంచి వానలే పడ్డాయి. మధ్యాహ్నం నుంచే ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. భారీ వర్షం పడటంతో దుక్కి దున్నేందుకు అన్నదాతలు రెడీ అవుతున్నారు. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం అవుతుంది. ఆ కార్తెలో విత్తనాలు వేయడం, వరి నారుమళ్లు చేస్తుంటారు.

దుక్కులకు అనుకూలం

బాలానగర్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడింది. వర్షానికి వరి పైరు నేలకొరుగగా, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. వర్షంతో ఎండ వేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం దుక్కులు దున్నడానికి అనుకూలంగా ఉందని రైతులు అంటున్నారు.

నేల వాలిన వరి

రాజాపూర్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం పడింది. దాంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కోయని చోట పంట నేలవాలింది. చేతికొచ్చిన పంట నేలపాలవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

దెబ్బతిన్న ఇటుక బట్టీలు

నవాబ్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. యన్మనగండ్ల, రుక్కంపల్లి, చెన్నారెడ్డిపల్లి, నవాబ్‌పేట గ్రామాల్లో వర్షం పడింది. పలు గ్రామాల్లో వరి పంటకు, యన్మనగండ్లలో ఇటుక బట్టీలకు నష్టం వాటిల్లింది. రైతు ముజ్జకీర్ పుచ్చకాయ తోట దెబ్బతిన్నంది. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పెంట్లవెల్లిలో అత్యధికం

నాగర్‌కర్నూల్ జిల్లాలో శుక్రవారం రాత్రి, శనివారం వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి పెంట్లవెల్లిలో అత్యధికంగా 68 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కొల్లాపూర్‌లో 11 మిల్లీ మీటర్లు, అచ్చంపేటలో 10.5, పెద్దకొత్తపల్లిలో 5.5, కోడేరులో 2.5, వంగూరులో 1.8, బిజినేపల్లిలో 1.5, బల్మూరులో 1.3, తెలకపల్లిలో ఒక మిల్లీ మీటరు వర్షపాతం నమోదైంది. శనివారం మధ్యాహ్నం జిల్లాలో స్వల్ప వర్షం పడింది. బిజినేపల్లి మండలంలోని పాలెంలో 4.3 మిల్లీ మీటర్ల వర్షం కురువగా, నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెరలో రెండు మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షంతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. గరిష్ఠంగా 27 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

గద్వాలలో చిరు జల్లులు

జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు వర్షం కురిసింది. 48 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం సాయంత్రం గద్వాలలో చిరుజల్లులు పడ్డాయి.



జడ్చర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రహరీకి పడిన గండి



రాజాపూర్‌లో వర్షానికి తడవకుండా ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవాబ్‌పేట, మే 18: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నవాబ్‌పేట మండలం గురుకుంట సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అభిషేక్ రెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం పోలెపల్లికి చెందిన కుర్వ శ్రీశైలం(45) నవాబ్‌పేట నుంచి గురుకుంట వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీకొనడంతో శ్రీశైలం కుడి చెయి తెగి పడింది. తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ పరిలించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలులో నుంచి జారిపడి వృద్ధురాలి దుర్మరణం

మహబూబ్‌నగర్, మే 18: రైలులో నుంచి ప్రమాదవ శాత్తు జారి పడిన ఓ వృద్ధురాలు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని మహిళ(65) గొల్లపల్లి-బాలానగర్ మధ్యలో రైలు లోంచి జారి పడింది. దాంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించింది. మహిళ నలుపురంగు బ్లౌజు, లేత గోధుమ రంగు చీర ధరించి ఉంది. నలుపు తెలుపు రంగులో వెంట్రుకలు ఉన్నాయి. కుడి చెయ్యి పై హిందీలో పచ్చబొట్టు ఉన్నది. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు.





దెబ్బతిన్న జూరాల కాల్వ లైనింగ్

- పట్టించుకోని అధికారులు
- చివరి ఆయకట్టుకు నీరందడం కష్టమే

పెబ్బేరు, మే18: పెబ్బేరు ప్రాంత రైతులకు సాగునీరు అందించే జూరాల ప్రధాన ఎడమ కాల్వ మైనర్ కాల్వలు పూర్తిగా లైనింగ్ దెబ్బతింది. అయిన అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతీ ఏడాది జూరాల కాల్వ మరమ్మ తులు చేపట్టాల్సి ఉండగా గత కొన్నేళ్ల నుంచి కాల్వల మరమ్మతులు చేపట్టక పోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. వేల ఎకరాలకు సాగు నీరు అందించే కాల్వల పరిస్థితిపై రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. జూరాల కాల్వ మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో రోజు రోజుకు కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రధాన కాల్వలో అలాగే మైనర్, సబ్ మైనర్ కాల్వల్లో మట్టి, వండు, చెట్లు చెత్తాచెదారం నిండిపోవడంతో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. చివరి ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదు. పెబ్బేరు మండల పరిధిలోని డీ-6, డి-5, డి-19, 20,21మైనర్ కాల్వలు పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. దీంతో నీరు అందక రైతులు నీటి కోసం గొడవలు పడే పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలంలో కాల్వల మరమ్మ తులు చేపట్టాల్సి ఉండగా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయకపోయిన ఉపాధి హామీ పథకం ద్వారానైనా కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం మట్టిని తొలగించే కార్యక్రమనైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వేసవి కాలం ముగిసి వర్షకాలం ప్రారంభమయ్యే నాటికి కాల్వల మరమ్మతులు చేపట్టాలని జూరాల ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


లైనింగ్ దెబ్బతిన్న జూరాల కాల్వ

ప్రభుత్వం నిధులు కేటాయించాలి



జూరాల కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించి కాల్వల్లో దెబ్బతిన్న లైనింగ్, మట్టి, చెత్తాచెదారం తీయించి రైతులకు సాఫీగా సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలి. జూరాల కాల్వలపై పర్యవేక్షణ కొరవడింది. కాల్వలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అధికారులు కాల్వలపై దృష్టి పెడితే బాగుంటుంది.


- శ్రీనివాసులు, రైతు, తోమాలపల్లి















ముమ్మళ్లపల్లిలో పట్టపగలు చోరీ


దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ

కొత్తకోట, మే 18 : దొంగలు పట్టపగలు తమ ప్రతాపం చూపిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల ముమ్మళ్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోకారి రామచంద్రయ్య, మన్నెమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి ఉపాధిహామీ పనులకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు గమనించి తాళం పగులగొట్టారు. ఇంట్లో బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు, రూ. ఎనిమిది వేల నగదు తీసుకెళ్లారు. పనుల నుంచి ఇంటికి వచ్చిన దంపతులకు ఇంటి తలుపులు తెరుచుకొని ఉండడంతో పాటు తాళం విరిగి పడి ఉండడంతో దొంగతనం జరిగిందని లబోదిబోమంటూ ఇంటిలోనికెళ్లి చూడగా బీరువా తెరుచుకొని ఉన్నది. బంగారు, నగదు కనబడ లేదు. దాంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో వచ్చి ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రల సేకరణ చేపట్టారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం


మంటలను ఆర్పుతున్న సిబ్బంది

మదనాపురం, మే 18: ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైన సంఘటన శనివారం సాయంత్రం వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోవిందహళ్లి గ్రామ శివారులో కొత్తకోటకు చెందిన శరత్‌కుమార్‌రెడ్డి బర్రెల షెడ్డు నిర్వహిస్తున్నాడు. వాటి కోసం భారీ మొత్తంలో గడ్డివాములను నిలువ చేశాడు. ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగలడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. అప్పటికే సగం భాగం గడ్డివాము దగ్ధమైంది. గేదెల కోసం 80ఎకరాల గడ్డి సేకరించామని బాధితుడు తెలిపారు. దీని విలువ సుమారు రూ. 4.50లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

గోపాల్‌పేట మండల కేంద్రంలో..

గోపాల్‌పేట: గోపాల్‌పేట మండల కేంద్రంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో వరి చేను కోసి పశువుల కోసం సుమారు 40ఎకరాలలో వదిలిన గడ్డిని గుర్తుతెలియని వ్యక్తులు శనివారం మధ్యాహ్నం నిప్పంటించారు. దీనికి గాలి తోడు అవ్వడంతో మంటలు వ్యాపించాయి. రైతుల సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకవచ్చారు. మంటలు అంటుకున్న పొలం పక్కనే హెచ్‌పీ పెట్రోల్‌బంక్, భారత్ గ్యాస్ ఏజెన్సీ ఉండడం తో ప్రజలు భయ బ్రాంతులకు గురైయ్యారు. మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బందికి గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

మారేపల్లిలో మహిళ కిడ్నాప్

తిమ్మాజిపేట, మే 18 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన హంసమ్మ శుక్రవారం కిడ్నాప్ కాగా, ఆమె కూతురు శనివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసు లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దరేవల్లి నుంచి స్వగ్రామమైన మారేపల్లికి చేరుకున్న హంసమ్మను పెద్దరేవల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు బొలెరో వాహనంలో శుక్రవారం తీసుకెళ్లారు. ఈ విషయమై గ్రామంలోని చుట్టుపక్కల వారి సమాచారం మేరకు తన తల్లికి ఎన్నిమార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని కూతురు శిరీష స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇటీవల కుదిరిన ఓ పెళ్లి సంబంధం విడిపోవడానికి హంసమ్మ కారణమని అనుమానంతోనే ఈ కిడ్నాప్ చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ మేరకు కిడ్నాప్ చేసిన వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా విక్రయదారులపై కేసు నమోదు

కొల్లాపూర్, మే 18 : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో సారా విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.నాగిరెడ్డి వెల్లడించారు. సారా విక్రయిస్తున్న విక్రయదారుల నుంచి 14లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. పట్టణంలో సారా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి హెచ్చరించారు. పట్టణంలో నాటుసారా విక్రయదారులపై ఆకస్మిక దాడులు నిర్వహించి వారిలో ఎక్సైజ్ ఎస్ఐ హనుమంతు, డీటీఎఫ్ ఎస్ఐ అరుణ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

మల్దకల్, మే 18 : గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని ఎల్కూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రం-1లో టీచర్ బుడ్డమ్మ(45) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. బుడ్డమ్మ మృతి పట్ల తోటి అంగన్‌వాడీ టీచర్లు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రూ.20వేల ఆర్థిక సాయాన్ని సీడీపీవో కమలాదేవి అందజేశారు. ఈమె వెంట అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీరంగమ్మ, మహేశ్వరమ్మ, వరలక్ష్మి, షమీం, లక్ష్మి తదితరులున్నారు.

వాగ్దేవి కళాశాలకు అంతర్జాతీయ గుర్తింపు

- ఐఎస్‌వో ధ్రువపత్రాన్ని అందుకున్న కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి



ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందుకుంటున్న వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 18 : తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా అంతర్జాతీయ గుర్తింపు ప్రమాణాలు ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలగా వాగ్దేవి గుర్తింపు పొందింది. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్ డైజేషన్ (ఐఎస్‌వో) సంస్థ ద్వారా గుర్తింపు సర్టిఫికెట్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివయ్య నుంచి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఐఎస్‌వో మేనేజింగ్ డైరెక్టర్ శివయ్య మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా మెరుగైన విద్య, క్రమశిక్షణ, మానవీయ విలువలను పెంపొందిస్తూ సామాజిక స్ఫూర్తిని కలుగజేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పూలబాటలు వేస్తున్న కళాశాల వాగ్దేవి అన్నారు. మొట్టమొదటి సారిగా ప్రైవేట్ జూనియర్ కళాశాలకు ఈ గుర్తింపు వచ్చిందన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్‌సు మన్ మాట్లాడుతూ ఓ ప్రైవేట్ కళాశాలకు అంతర్జాతీయ గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, ఇంటర్మీడియట్ జిల్లా కార్యాలయం సూపరింటెండెంట్ సందీప్‌రెడ్డి, సాధిక్ , కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ నీట్ అకాడమి ఇన్‌చార్జి పావనిరెడ్డి , ఎంసెట్ ఇన్‌చార్జి షాకీర్, వైస్‌ప్రిన్సిపాల్ జ్యోతినందన్‌రెడ్డి, డైరెక్టర్ కోట్ల శివకుమార్, నాగేందర్, రాఘవేందర్‌రావు , మేఘ్యనాయక్, నరేష్, రఘువరన్ రెడ్డి , సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టేడియం షాపుల వేలం ఇంకెప్పుడో?

- తొమ్మిదేళ్లుగా తెరచుకోని దుకాణాల షెట్టర్లు
- తలకు మించిన భారంగా స్టేడియం నిర్వహణ
- ఆదాయ వనరులపై దృష్టి సారించని అధికారులు

గద్వాల అర్బన్, మే 18 : గద్వాల జిల్లా కేంద్రంలో 11 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఇండోర్ స్టేడియంలో భాగంగా నిర్మించిన దుకాణాలు తొమ్మిదేళ్లుగా మూతపడి దిష్టి బొమ్మల్లా మారాయి. ఆధునిక క్రీడా సదుపాయాలతో నిర్మించే స్టేడియంలో క్రీడాకారులకు కావాల్సిన అన్ని పరికరాలను అందుబాటులో ఉంచడంతో పాటు క్రీడల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అప్పట్లోనే ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు స్టేడియం నిర్వహణపై కూడా దృష్టి సారించారు. ఆ కోణంలోనే స్టేడియం చివరి భాగంగా న్యూగంజ్ ప్రధాన రహదారి నుంచి మేళ్లచెరువు క్రాస్ చెరువు వరకు ఉంటే రోడ్డువైపు ఆరు వాణిజ్య దుకాణాలను నిర్మించారు. వీటిద్వారా ఎంతో కొంత ఆర్థిక ఆదాయం అందిస్తే స్టేడియం నిర్వహణ సాఫీగా సాగుతాదని అప్పటి అధికారుల అంచనా. అంతవరకు బాగానే ఉన్నా ఆచరణలోనూ షాపుల నిర్మాణం కార్యారూపం దాల్చినా వాటిని ఆర్థిక వనరుగా మార్చుకునే విషయంలో అధికారులు విఫలమయ్యారు.

భారమైన నిర్వహణ

ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, జిమ్ వంటి ఇండోర్ గేమ్స్‌తో పాటు స్టేడియం ఆవరణలో వాకర్స్ అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, ఓపెన్ జిమ్ తదితర క్రీడలు కొనసాగుతుండగా, వీటి కోసం తప్పనిసరిగా చేయాల్సిన నిర్వహణ ఖర్చులు అధికారులకు భారంగా మారాయి. ఇందుకోసం ఆయా ఆటల్లో పాల్గొనే వారికి ప్రవేశ రుసుముతో పాటు నెలసరి ఫీజును నిర్ణయించినప్పటికీ వాటిపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తగా వెనుకంజ వేసిన అధికారులు, మూడేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి అనుమతితో కేవలం ఇండోర్ గేమ్స్ కోసం మాత్రమే నామమాత్రపు ఫీజు వసూలు చేయడం ప్రారంభించారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ వస్తున్న క్రీడాకారుల సంఖ్యకు, వసూళ్లు సకాలంలో జరగడం లేదు. షెటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు, జిమ్‌కు వచ్చే వారుమాత్రమే నెలసరి ఫీజులు చెల్లిస్తుండగా వారి సంఖ్య తక్కువగా ఉండటంతో స్టేడియం నిర్వహణ ఖర్చులకు, వచ్చే ఆదాయానికి పొంతన కుదరడం లేదు. స్టేడియం విద్యుత్ చార్జీ నెలకు రూ.ఏడు వేలు దాటుతుండగా, ఇద్దరు వాచ్‌మెన్(పగలు, రాత్రి)లకు రూ.10 వేలు, ఇతర ఖర్చులు కలుపుకుంటే మొత్తం ప్రతీనెల స్టేడియం నిర్వహణ రూ.18వేల నుంచి రూ.20వ వేల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న షాపులకు వేలం నిర్వహిస్తే ప్రతీ నెల కనీసం రూ.40వేలకు పైగానే ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని క్రీడాకారులు చెబుతున్నారు. షాపులకు ముందున్న రోడ్డును ఇటీవలే నాలుగు లైన్లుగా విస్తరించడం, సమీపంలోనే పట్టణ పోలీస్ స్టేషన్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం జరగడంతో ఈ రోడ్డు వ్యాపారపరంగా మరింత వృద్ధి చెందడాన్ని పలువురు ప్రస్తావిస్తున్నారు. షాపులకు వేలం నిర్వహిస్తే వ్యాపారుల నుంచి మంచి స్పందన లభించే అవకాశం ఉంటుందని, ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

వేలానికి రాజకీయ అవరోధం

గద్వాల ఇండోర్ స్టేడియంకు చెందని షాపుల వేలంకు రాజకీయ అవరోధం జరుగుతున్నట్లు స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. షాపులు ఉన్న ఏరియాకు ఇటీవల వ్యాపార పరంగా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో కొంతమంది మొత్తం షాపులను తాము దక్కించుకునేలా అధికారులపై రాజకీయ ఒత్తిడిలు తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం షాపుల వేలం నిర్వహణకు అధికారులు కసరత్తు చేయగా, అప్పట్లోనే ఈ రకమైన ఒత్తిడి, పైరవీ మొదలుకావడంతో అధికారులు వేలంను వాయిదా వేశారు. రెండేళ్ల క్రితమే ఈ పరిస్థితి ఎదురు కాగా పెరిగిన మార్కెట్ డిమాండ్ దృష్ట్యా ప్రస్తుతం ఆ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంటుందని పలువురు వ్యాపారులు బాహాటంగానే చెబుతున్నారు. ప్రస్తుత కలెక్టర్ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి షాపుల వేలంకు మార్గం సుగమమం చేయాలని, తద్వారా స్టేడియం నిర్వహణ సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని స్టేడియం షాపులు

సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



స్టేడియం నిర్వహణలో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఇండోర్ స్టేడియంలోని షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్వహణ ఖర్చుతో కూడినది కావడంతో రెగ్యులర్ ఆదాయం ఉండాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశాము. ఎన్నికల కోడ్ ఉన్నందున్న గడువు ముగిసేలోగా మరో సారి సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తాం.

- డాక్టర్ బీఎస్ ఆనంద్, డీవైఎస్‌వో

21 నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు



నరసన్నగుట్టపై స్వయంభుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి

తిమ్మాజిపేట, మే 18 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో ఉన్న నరసన్నగుట్టపై స్వయంభుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి ప్రథమ వార్షిక ఉత్సవాలు ఈ నెల 21, 22 తేదీల్లో కొనసాగుతాయి. ఈ సందర్భంగా మొదటి రోజు లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం, మంటప పూజలు, సుదర్శన మంటప ఆవాహిత దేవత హోమం, తీర్థప్రసాదాల వితరణ, రెండవ రోజు ప్రత్యేక అభిషేకాలతో పాటుగా చండీహోమం, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాల చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులతో పాటుగా అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఆటో డ్రైవర్ మృతిపై కేసు నమోదు

తెలకపల్లి, మే 18 : పోలీసులు విచారణకు రమ్మనడంతో కొడతారని భయంతో ఆటో డ్రైవర్ వెంకటయ్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాఠకులకు విదితమే. ఈ ఘటనపై మృతుడి భార్య ఆలివేల శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. అనంతరం మృతుడి భార్య ఆలివేలు మాట్లాడుతూ పోలీసులు కొడతారని భయంతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించింది. తన భర్త మృతికి కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులను కోరింది. ఈ సంఘటనపై ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ వెంకటయ్యను కేవలం విచారించి పంపించామని ఎక్కడా కూడా కొట్టలేదన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హత్యకేసులో ఎనిమిది మంది రిమాండ్

- మరో ఇద్దరు పరారీ - వివరాలు వెల్లడించిన సీఐ గాంధీ నాయక్



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సీఐ గాంధీనాయక్

మహబూబ్‌నగర్,మే18: మద్యం దుకాణం వద్ద బీరు విషయంలో జరిగిన గొడవ హత్యకు దారితీయడంతో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. బీరు విషయంలో తలెత్తిన గొడవ కాస్త హత్యకు దారితీయడం పాలమూరులో దుమారం రేపింది. ఈ ఘటనను అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా తప్పుపట్టారు. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు సీసీపుటేజీలు పరిశీలించి పలువురిపై కేసు నమోదుచేశారు. ఈమేరకు శనివారం రూరల్ సీఐ గాంధీనాయక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గతనెల 25న బండమీదిపల్లిలోని మల్లికార్జున వైన్స్‌కు అడ్డాకుల మండలం బలీద్‌పల్లికి చెందిన శ్రీకాంత్‌యాదవ్ బీరుకోసం వెళ్లాడు. ఆ సమయంలో కౌంటర్‌పై ఉన్న రవికుమార్‌రెడ్డి దురుసుగా మాట్లాడటంతో గొడవ మొదలైంది. గొడవ పెద్దదికాగా వైన్స్ యజమానులు, అందులో పనిచేసే సిబ్బంది అంతా కలిసి శ్రీకాంత్‌ను మూకుమ్మడిగా దాడిచేశారు. కర్రలతో చేతులతో పిడిగుద్దులు గుద్దారు. విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రగాయాలైన శ్రీకాంత్ ఆసుపత్రిలో చేరాడు. కడుపులో పేగులు, కాలేయం వంటి అవయాలు కూడా దెబ్బతినడంతో హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 14న చనిపోయాడు. మృతుడి తల్లి వెంకటేశ్వరమ్మ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేశారు. ఈ కేసులో 10 మందిపై సెక్షన్ 342,302, 323, రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదుచేశారు. భూత్పూర్ మండలం గోప్లాపూర్‌కు చెందిన చింతలపల్లి రవికుమార్‌రెడ్డి, పట్టణంలోని హనుమాన్‌పురకు చెందిన అరుణ్‌కుమార్ రెడ్డి, గోప్లాపూర్‌కు చెందిన దర్శనం రాకేశ్, హనుమాన్‌పురకు చెందిన కోట్ల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బండమీదిపల్లికి చెందిన కోట్ల కృష్ణారెడ్డి, రాజీవ్ గృహకల్పకు చెందిన పికిలి వెంకటేశ్, బండమీదిపల్లికి చెందిన జర్పటి చెన్నమ్మ, బండమీదిపల్లికి చెందిన గజగౌని చంద్రప్రకాశ్‌గౌడ్‌లు అరెస్ట్ కాగా, మరో ఇద్దరు నిందితులు శివశంకర్, రఘుపతిరెడ్డిలు పరారీలో ఉన్నారని తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

నవాబ్‌పేట, మే 18: పాత కక్షలను మనసులో పెట్టుకుని పొలం వద్ద ఉన్న ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తుల మీద కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అభిషేక్ రెడ్డి శనివారం తెలిపారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన నర్సింహులు ఈనెల 8న పొలం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన నర్సింహులు, విష్ణు, నవీన్ అనే వ్యక్తులు ఇనుప రాడ్డుతో దాడి చేయడంతో నర్సింహులుకు తీవ్రగాయాలు కాగా జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణ ఎప్సెట్ ఫలితాల్లో

ప్రతిభ విద్యార్థుల జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ కళాశాల గౌరవ సలహాదారులు, యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 18 : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్సెట్ ఫలితాలు శనివారం విడుదల అయ్యాయి. ఈ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. రాష్ట్రస్థాయిలో అగ్రికల్చర్ విభాగం జె.వెంకటేష్ 1585వ ర్యాంక్ , జి.మౌనశ్రీ 2053వ ర్యాంక్, ఆర్.చంద్రిక 2635వ ర్యాంక్, ఎం.సుప్రియ 3052వ ర్యాంక్, ఎం.రక్షత 3388వ ర్యాంకు, జి.ప్రణీత 3555వ ర్యాంకు, సహూరతంకిన్ 3758వ ర్యాంకు, జి.సంధ్యారాణి 4665వ ర్యాంకు , వి.మౌనిక 4760వ ర్యాంకు, వి.ప్రణిన్సిక 5198వ ర్యాంకు , ఎం.అక్షయ 5231వ ర్యాంకు, ఎం.డి మతీణ్ మొయినోద్దిన్ 5277వ ర్యాంకు , షాగుఫ్తనాజ్ 5458వ ర్యాంకు, సానియా 5640వ ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో గణేష్ 970వ ర్యాంక్, బి.అనిరుధ్‌గౌడ్ 2296వ ర్యాంక్, శ్రీకాంత్ 2577వ ర్యాంక్, అభిజిత్ 2781వ ర్యాంక్ , వి.సాయిఈశ్వర్ 2923వ ర్యాంక్, ఆర్.నవ్యశ్రీ 3416వ ర్యాంక్ , వి.చరణ్‌లాల్ 5024వ ర్యాంక్, టి.నాగసాయిచేతన్ 5195వ ర్యాంక్ , ఎం.నమిత 5425వ ర్యాంక్ , తరుణ్ 5678వ ర్యాంక్ , ఎ.మహేందర్ 5890వ ర్యాంక్ సాధించారు. వీరితో పాటు ఇంజనీరింగ్, అగ్రికల్చర్‌లో పదివేల లోపు ర్యాంకులు 78 మంది సాధించారు. 15000 ర్యాంకుల లోపు 22మంది, 20వేలలోపు ర్యాంకులు 29మంది విద్యార్థులు సాధించారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల గౌరవ సలహాదారు కె.మంజులాదేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్దన్ రెడ్డి, జి.వెంకటేశ్వర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర స్థాయి పరీక్షలలో తమ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎప్సెట్ ఫలితాల్లో

రిషి కళాశాల విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న రిషి కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 18 : తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్సెట్ ఫలితాలు శనివారం విడుదల అయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. రాష్ట్రస్థాయిలో ఎప్సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో కళాశాలకు చెందిన విద్యార్థులు కె.అనన్య 502వ ర్యాంక్, దానియానాజీష్ 510వ ర్యాంక్, శ్రీజచిన్ని1031 వ ర్యాంక్, ఎం .సాయికీర్తన 1069వ ర్యాంక్, కె.శ్రీజ 1100 వ ర్యాంకు, టి, గణేష్ 1118వ ర్యాంకు , పి.యశస్వి 1142వ ర్యాంకు , ఆర్.పి అమూల్య 1317వ ర్యాంకు, జి.వినూత్న 1373వ ర్యాంకు , ఎస్.పరిపూర్ణ 1457వ ర్యాంకు , కె.అర్నవ్ వసిష్ట 1507వ ర్యాంకు , ఎం.శ్రావణ్‌సందేష్ 1519వ ర్యాంకు , పూర్ణాదావే 1653వ ర్యాంకు, ఎ.తేజశ్విని 1789వ ర్యాంకు, జి.సుమేధా, చంద్రా 2115వ ర్యాంకు, వీరిలో పాటు 380 మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎ. సాకేత్‌సింగ్ 1559వ ర్యాంక్ , పి.సిద్దార్థ 3259 వర్యాంక్ , ఎ.దివ్యయశధ 5191వ ర్యాంకు , ఎం.సతీష్ 6098 వర్యాంకు , ఎ.చందన 6142వ ర్యాంక్, జి.ప్రసన్నలక్ష్మి7564వ ర్యాంక్, జి, మోహన్ 9443వ ర్యాంక్, మానస 9700వ ర్యాంక్ , త్రిశాల్ 9732వ ర్యాంక్ , కె.సరస్వతి 12190వ ర్యాంక్, కె.శ్రీవైష్ణవి 13439వ ర్యాంక్, ఫైకాఅమ్రీన్ 13508వ ర్యాంక్, కె.శ్రీకర్ 15960వ ర్యాంకులు సాధించారు. వీరితో పాటు ఇంజనీరింగ్ , అగ్రికల్చర్‌లో పది వేల లోపు ర్యాంకులు 78 మంది సాధించారు. 15వేల లోపు ర్యాంకులు 22 మంది , 20వేల లోపు ర్యాంకులు 29మంది విద్యార్థులు సాధించారు. పాటు 215మంది విద్యార్థులు అర్హత సాధించారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, ముఖ్య సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ కళాశాలల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మే 18 : తెలంగాణ గిరిజన ఏకలవ్య రెసిడెన్సియల్ పాఠశాలల్లో (2024-25 విద్యా సంవత్సరం) ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌ల్లో (సీబీఎస్‌ఈ సిలబస్)లో మిగిలిన సీట్లల్లో ప్రవేశం కోసం 10వ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థుల (బాలురు) నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీడబ్ల్యూ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి కె. నాగార్జున రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో పొందిన జీపీఏ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తెలంగాణ ఏకలవ్య రెసిడెన్సియల్ పాఠశాల బాలానగర్, కల్వకుర్తి ప్రిన్సిపాళ్ల నుంచి దరఖాస్తు ఫారం పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు అన్ని అర్హతల ధ్రువీకరణ పత్రాలను జతచేసి ఈ నెల 20 సాయంత్రం 4గంటలలోపు సంబంధిత ప్రిన్సిపాళ్లకు సమర్పించాలని కోరారు. 10వ తరగతిలో పొందిన జీపీఏ ఆధారంగా ఈ నెల 22న బాలానగర్ రెసిడెన్సియల్ పాఠశాలలో ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తర్వాత మిగిలిన సీట్లకు అదేరోజు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజనం, నోటు పుస్తకాలు, బెడ్స్, దుస్తులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9490957312,-13 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అగ్నివీర్ వాయు ర్యాలీలో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మే 18 : కాన్పూర్, బెంగళూరులో భారత వాయు సైన్యం అఖిల భారత అగ్నివీర్ వాయు (మ్యూజీషియన్)ఖాళీల భర్తీకి నిర్వహించనున్న ర్యాలీకి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి జూన్ 5లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి మహ్మద్ జానీపాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004 జనవరి 2, 2007 జూలై 5 మధ్య జన్మించి అవివాహిత పురుష, స్త్రీ అభ్యర్థుల అర్హులన్నారు. తాత్కాలికంగా అడ్మిట్ కార్డు జారీ అయిన అభ్యర్థులు మాత్రమే రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు అనుమతి ఉంటుందన్నా. రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీ, సమయం తాత్కాలిక అడ్మిట్ కార్డులో పేర్కొనున్నట్లు ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

మల్దకల్, మే 18: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు శనివారం తెల్లవారుజామున గద్వాల జిల్లా మల్దకల్ మండలం మల్లాపురం తండా దగ్గర పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గట్టు మండలం బల్గెర గ్రామం నుంచి అదే గ్రామానికి చెందిన వీరేంద్ర ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఇసుకను ట్రాక్టరును పోలీసుస్టేషనుకు తరలించి వీరేంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎప్సెట్ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 18 : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్సెట్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభజంనం సృష్టించారు. రాష్ట్రస్థాయిలో అగ్రికల్చర్ విభాగంలో అఖిల (2039)వ ర్యాంక్ , ఇంజనీరింగ్ విభాగంలో అన్విత 2243వ ర్యాంకు, నవ్యశ్రీ 2528 వ ర్యాంకు, వంశీకృష్ణ 2541వ ర్యాంకు, వైస్వాతి 3478వ ర్యాంకు, కీర్తన 4893వ ర్యాంకు, శశాంక్ 6197వ ర్యాంకు, కావ్య 6632 వ ర్యాంకు, సాయి దీపిక 8152వ ర్యాంకు, సభ ఫాతిమా 8438వ ర్యాంకు, భాగ్యలక్ష్మి 8760వ ర్యాంకు, వైష్ణవి 9661వ ర్యాంకు సాధించారు. వీరి తో పాటు 15వేల ర్యాంకుల్లోపు 22మంది, 20వేల ర్యాంకుల్లోపు 29మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి , ప్రిన్సిపాల్ గీతాదేవి , ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి , ఎంసెట్ ఇన్‌చార్జి షాకీర్, వైస్‌ప్రిన్సిపాల్ జ్యోతి నందన్‌రెడ్డి , యాజమాన్య సభ్యులు రాఘవేంద్రరావు, కోట్ల శివకుమార్, నాగేందర్ , మేఘ్యానాయక్ , సతీష్‌రెడ్డి , అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జాతీయ , రాష్ట్ర స్థాయి పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించారన్నారు. పరీక్ష ఏదైనా ర్యాంకుల సాధించడం వాగ్దేవికే సాధ్యమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల్లో భక్తుల పూజలు



జోగులాంబదేవి ఆలయంలో పూజల అనంతరం ఢిల్లీ అదనపు డైరెక్టరు సంతోష్‌కుమార్ పాండే

అలంపూర్, మే 18: ఐదవ శక్తి పీఠం అలంపూర్ జోగులాంబదేవి, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను చేపట్టారు.

- ఆలయంలో ఢిల్లీ అదనపు డైరెక్టరు పూజలు

ఐదవ శక్తి పీఠం అలంపూర్ శ్రీ జోగుళాంబ దేవి, బాలబ్రహ్మేశ్వర స్వామివార్లను గవర్నమెంటు ఆఫ్ ఇండియా ఢిల్లీలో అదనపు డైరెక్టరు సంతోష్ కుమార్ పాండే దర్శించుకున్నారు. శనివారం అలంపూర్‌కు చేరుకున్న అదనపు డైరెక్టరుకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ మంజుల, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గుడిసె దగ్ధం

గట్టు, మే 18 : జీవనోపాధి కోసం వేసుకున్న గుడిసె ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఈ సంఘటన గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడు స్టేజీ సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఆరగిద్ద గ్రామానికి చెందిన మారెప్ప పెంచికలపాడు స్టేజీ దగ్గర గుడిసె ఏర్పాటు చేసుకుని చేపల ఫ్రై చేస్తూ విక్రయించేవాడు. శనివారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగి గుడిసెకు పాకాయి. దీంతో గుడిసె మొత్తం అగ్నికి ఆహుతి అయింది. ఈ సంఘటనతో వంట సామగ్రితోపాటు ఫ్రిజ్, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడటంతో ఆర్పివేసేందుకు సాధ్యపడలేదని బాధితుడు వాపోయాడు. సుమారు రూ1.50 లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, మే 18: గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో శనివారం జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అలంపూర్ మండలం, లింగనవాయి గ్రామానికి చెందిన లక్ష్మన్న, భీమపల్లి బైక్‌పై మద్దిలేటి స్వామి దైవదర్శనానికి వెళ్తుండగా ఉత్తరఫీడ్స్ వద్ద హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఓ కారు వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికిగా బలమైన గాయాలయ్యాయి. వారిని జాతీయరహదారి సిబ్బంది కర్నూలు ఆసుపత్రికి తరలించారు. భీమపల్లి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు

మిడ్జిల్, మే 18: తన భర్త నరసింహులు అదృశ్యమైనట్లు భార్య పుణ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపారు. తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామానికి చెందిన నరసింహులు శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి సాయంత్రం అయిన ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వారిని, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికిన ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో తాను ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన భర్త ఎత్తు 5.2 ఫీట్ల ఎత్తు, చామనఛాయ రంగులో ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నాట్లు తెలిపారు.

వైన్స్‌లో చోరీ

గోపాల్‌పేట, మే18 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని కనకదుర్గ వైన్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ హరి ప్రసాద్, వైన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో వైన్స్ షాప్‌లో పని చేస్తున్న క్యాషియర్ యుగేందర్ రోజులాగానే షాప్ మూసివేశాడు. శనివారం ఉదయం 10 గంటలకు తెరిచి లోపలి వెళ్లి చూడగా క్యాష్ కౌంటర్ తెరిచి ఉందన్నారు. కౌంటర్‌లో ఉన్న రూ. 25వేల నగదు కనిపించలేదు. షాప్ పై కప్పు రేకును బ్లేడ్ సాయంతో పెద్ద రంధ్రం చేసి గుర్తు తెలియని వ్యక్తి లోపలికి ప్రవేశించి నగదు, ఒక ఫుల్‌బాటిల్ ఎత్తుకెళ్లినట్లు గమనించి షాప్ యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన వేడుకలు



పెద్దకొత్తపల్లిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, మే 18 : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణులు, గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన వేడుకలను పురస్కరించుకుని గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామి వారికి పెద్ద ఎత్తున పూజలు చేశారు. భక్తులకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు గ్రామ ప్రజల సహకారంతో అన్నదానం చేశారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినందుకు పెద్దకొత్తపల్లి మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, దండు నరసింహలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, మాజీ ఉప సర్పంచ్ మశన్న, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్, కరుణాకరాచారి, మహేషాచారి, జగదీశాచారి, రాజశేఖర్, రంగయ్య, శరత్, సురేష్, కాంగ్రెస్ నాయకులు మేకల చంద్రయ్య శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



పెంట్లవెల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెంట్లవెల్లి, మే 18 : మండల కేంద్రంలో కొల్లాపూర్‌దారిలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మొదటగా గణపతి పూజ, ఆరాధన, మహామంగళహారతి, హోమం, అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కల్యాణం ఘనంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రెసిడెంట్ సుదర్శన్, వైస్ ప్రెసిడెంట్ శ్రీను, ఎంపీటీసీ సుమలత, గ్రామస్థులు శేషు, నరసింహయాదవ్, రామన్‌గౌడ్, నరసింహనాయుడు, సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్వంగలో..

తెలకపల్లి: మండల పరిధిలోని కార్వంగలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణమాచారి, రాఘవాచారి దంపతులు, చిన్న జంగయ్య, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



కొల్లాపూర్ మార్కెట్‌యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కే సీతారామారావు

కొల్లాపూర్/పెంట్లవెల్లి, మే 18 : వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా సేకరించాలని నాగర్‌కర్నూల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ కే.సీతారామారావు సూచించారు. శనివారం కొల్లాపూర్, మండల పరిధిలోని మాచినేనిపల్లి, పెంట్లవెల్లిలో పలు వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కే.సీతారామారావు మాట్లాడుతూ వర్షాలను దృష్టిలో పెట్టుకుని కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వడ్లను పూర్తిగా ఎండబెట్టిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా రైతులకు సూచించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు రైతులకు ఇవ్వాలన్నారు. గన్నీబ్యాగుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదించి గన్నీబ్యాగులను సమకూర్చుకోవాలన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తూ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. 17శాతం తేమ ఉన్న వరిని వెంటనే కొనుగోలు చేసి లారీల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పెంట్లవెల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ హిమబిందు, గ్రామస్థులు రామన్‌గౌడ్, మహిళా సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీసీవో స్వామికుమార్

తెలకపల్లి, మే 18: తెలకపల్లి మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం డీసీవో స్వామికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. రైతులు 14శాతం తేమను కలిగిన వరిని కొనుగోల కేంద్రాలకు తీసుకురావాలన్నారు. తహసీల్దార్ పాండునాయక్, ఏపీఎంలు బి.నిరంజన్, ప్రభాకర్, సీసీ నరసింహ, వీవోఏ పర్వాద్‌బేగం, తిరుపతయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

'సర్పంచ్ పదవిని ఎస్సీ రిజర్వ్‌డ్ చేయాలి'

లింగాల, మే 18 : మండల పరిధిలోని అంబటిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్సీ వర్గానికి రిజర్వ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బంగారయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల పరిధిలోని అంబటిపల్లిలో దళిత నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు సర్పంచ్ పదవి ఎస్సీలకు కేటాయించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్సీలకు కేటాయించి న్యాయం చేయాలని ఆయన కోరారు. గ్రామంలో 500 జనాభాతోపాటు 400వరకు ఎస్సీ ఓటర్లున్నారని ఆయన తెలిపారు. ఈ సారి అవకాశం కల్పించి ఎస్సీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దళిత నాయకులు భీముడు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి అస్థవ్యస్థం

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అమ్రాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గుంతలుగా మారిన రోడ్డుపై చేరిన వర్షపు నీరు

అమ్రాబాద్, మే 18: అచ్చంపేట, మద్దిమడుగు రహదారిలో ఉన్న అమ్రాబాద్ మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు గుంతలు ఏర్పడి అస్థవ్యస్థంగా తయారయ్యింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఈ రోడ్డుకిరువైపులా ఇళ్లలో నివసిస్తున్న ప్రజలకు తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో పైపులు వేయడానికి తవ్వారు. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలబడడంతో బురదమయంగా మారింది. గ్రామస్థులు, సంబంధిత మిషన్ భగీరథ అధికారులకు రోడ్డు మరమ్మతులు చేయించాలని ఎన్నిసార్లు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారిపై నిత్యం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి వందలాది వాహనాలలో మద్దిమడుగు ఆలయానికి వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకుంటారు. మండల కేంద్రంలో ఈ రహదారి సుమారు కిలోమీటరుపైగా ఉంటుంది. రహదారి అస్థవ్యస్థంగా ఉండటంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతుండడంతో దూర ప్రయాణాలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ విషయంలో సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ తీసుకుని తక్షణమే రోడ్డును మరమ్మతు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగేళ్లుగా ఇబ్బందులు

అమ్రాబాద్ మండల కేంద్రంలో మద్దిమడుగు ప్రధాన రహదారిపై గత నాలుగు సంవత్సరాల నుంచి గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహదా రులతో పాటు పెద్ద వాహనదారు లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. దూర ప్రాంతాలు నుంచి వ చ్చే వాహదారులు బాధలు వర్ణనా తీతం. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణ మే స్పందించి ఈ రోడ్డు మరమ్మతులు చేయించాలి.



- కంచర్ల ఆంజనేయులు, అమ్రాబాద్

రూ.65 కోట్లతో ప్రతిపాదనలు

గతంలో ఈ రోడ్డు విస్తరించడానికి రూ.65 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాం. అప్పట్లో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. వచ్చే జూలైలో మరొకసారి అమ్రాబాద్ మండల కేంద్రంలో రోడ్డును విస్తరించడానికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తాం.

మండల కేంద్రంలో స్థానికులు సహకరిస్తే పనులు త్వరగా ప్రారంభమవుతాయి.

- లక్ష్మీపతి నాయక్, ఆర్ అండ్ బీ ఏఈ, అచ్చంపేట

భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంతి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ జూలూరి రమేష్‌బాబు, భక్తులు

కల్వకుర్తి, మే 18 : కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత జయంతి వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఉదయం నుంచే వాసవీ మాతకు అభిషేకాలు, గీతాపారాయణం, హనుమాన్‌చాలీసా నిర్వహించారు. అమ్మవారికి పల్లకిసేవ అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలకు అన్ని రకాలుగా మేలు జరగాలని కోరారు. దైవచింతన కలిగి ఉంటే సత్ప్రవర్తన చేకూరి మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆయన తెలిపారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. నాయకులు శ్రీధర్, జగదీశ్వర్, శ్రీనివాస్, ఆంజనేయులు, రమణ, అశోక్, సతీష్, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి పద్మావతి వేంకటేశ్వర ఆలయంలో శనివారం వాసవీ మాత జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతను వివిధ రకాల పూలతో అలంకరించి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనిత, దామెర లక్ష్మి, తోట సంతోష, వర్షిని, వర్ధిని, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సాతాపూర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు వెండి కిరీటాన్ని బహూకరించారు. సాతాపూర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు 800గ్రాముల వెండితో తయారు చేయించిన 80 వేల విలువ గల వెండి కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులకు వారు అందజేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి, పూజారి ప్రవీణ్‌కుమార్, సాతాపూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగిశెట్టి, సభ్యులు మల్లేష్, రమేష్, రామకృష్ణ, సురేష్, పరమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి జయంతి వేడుకలు శనివారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెండి కిరీటాన్ని బహూకరిస్తున్న సాతాపూర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు

● మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి అంగపూజ. అష్టోత్తర శతనామావళి పఠనంతో పూజలు నిర్వహించారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు జూలూరి సత్యనారాయణ, సంబు వెంకటరమణ, మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, సంఘం నాయకులు రమేష్, సంబు శ్రీనివాసులు, నరేష్, శివశంకర్, బాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్మాపురం చెరువులోకి చేరిన వర్షపు నీరు



మాధవన్‌పల్లి సమీపంలో పారుతున్న తొక్కుడు బండల్ వాగు

అమ్రాబాద్, మే 18: అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం భారీ వర్షం కురిసింది. దీనితో వివిధ గ్రామాల్లో వాగులు, వంకలు వర్షపు నీటితో కళకళలాడాయి. మండలంలోని బీకే లక్ష్మాపురం, వంగురోనిపల్లి, మాధవానిపల్లి, కుమ్మరోనిపల్లి, ఈదుల బావి, అమ్రాబాద్ తదితర గ్రామాల్లో సుమారు గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీనితో అటవీ ప్రాంతం నుంచి భారీగా వచ్చిన వర్షం నీరు వాగులు వంకలలో ప్రవహించింది. వంగరోనిపల్లి సమీపంలోని లక్ష్మాపురం చెరువులోకి భారీగా వర్షపు నీరు చేరడంతో రైతులు హర్షం ప్రకటించారు. ఇదే స్థాయిలో మరొకసారి కురిస్తే ఈ చెరువు నిండటంతో పాటు అలుగుపారడం ఖాయమని వంగురోనిపల్లి గ్రామానికి చెందిన సుల్తాన్ యాదవ్ అనే రైతు తెలిపారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

లింగాల, మే 18 : మహిళలను చైతన్యపర్చి వారి జీవితాల్లో వెలుగు తెచ్చేందుకు మండల మహిళా సమాఖ్య పని చేస్తుందని ఏపీఎం బాలస్వామి అన్నారు. లింగాల గ్రామ సమైక్య సంఘం అధ్యక్షురాలు పోల మంగమ్మ అధ్యక్షతన మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. లింగాలలో 27మహిళా సంఘాలున్నాయని, వాటిలో 23సంఘాలు చురుకుగా పని చేస్తున్నాయని తెలిపారు. ప్రతీ నెల 4, 19 తేదీల్లో జరిగే గ్రామ సమైక్య సమావేశాలకు చిన్న సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు. గ్రామ సమైక్య సంఘం అధ్యక్షురాలు పోల మంగమ్మ, ప్రధాన కార్యదర్శి గీత, కోశాధికారి పెంటమ్మ, సీసీ యాదగిరి, వీవోఏ యశోద తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వర స్వామికి తిల తైలాభిషేకాలు



నందివడ్డెమాన్‌లో శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, మే 18 : సార్థసప్త శనీశ్వర స్వామి భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నల్లని నువ్వులు, తిల తైలాలతో భక్తిశ్రద్ధలతో భక్తులు అభిషేకాలు చేశారు. బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్‌లోని సార్థ సప్త జేష్టదేవి సమేత శనీశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ జన్మ, గోచార రీత్యా గ్రహదోషాలు ఉన్న వారు ఏలినాటి శని, అర్ధాష్టమి శని, అష్టమ శని గ్రహ బాధలు తొలగేందుకు శనీశ్వర స్వామికి తిల తైల అభిషేకాలు, బ్రహ్మ సూత్రం ఉన్న పరమ శివుడికి రుద్రాభిషేకాలు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచి శనీశ్వర స్వామిని, బ్రహ్మ సూత్రం ఉన్న పరమశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, ఆలయ సహాయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి, రేవల్లి శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జేపీనగర్‌లో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కల్వకుర్తి, మే 18 : కల్వకుర్తి పట్టణ పరిధిలోని జేపీనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి, సీతారామచంద్రస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు రెండవ రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. దేవాలయ చైర్మన్ పాత్లావత్ హనుమానాయక్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. హోమాలు, రుద్రహోమం, అభిషేకాలు, మంగళహారతి వేద పండితులు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆరాధనోత్సవాలు



యజ్ఞం చే[illegible] భక్తులు

వెల్దండ, మే 18 : మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు విశ్వబ్రాహ్మణ మనుమయసంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాలనుంచి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాలయం ప్రాంగణంలో యజ్ఞహోమాలు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తిపాటలు ఆలపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నదానం కృష్ణయ్య, పురుషోత్తమాచారి, అంజయ్య, రామాచారి, జంగాచారి, చెన్నయ్య, సత్యనారాయణ, గెల్వలాచారి ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

కల్వకుర్తి, మే 18 : కల్వకుర్తి పట్టణంలోని బలరామ్‌నగర్‌కు చెందిన తిరుపతిరెడ్డి, సంజాపూర్‌కు చెందిన సుమతమ్మలు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ బ్యంగి ఆనంద్‌కుమార్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీపీ

పెద్దకొత్తపల్లి, మే 18 : మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామంలో పెద్దకొత్తపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ దేవరపాగ బాలస్వామి సోదరుడు దేవరపాగ అనిల్‌కుమార్ శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెన్నచెర్ల గ్రామంలోని మృతుని కుటుంబాన్ని సందర్శించి అనిల్‌కుమార్ భౌతికకాయంపై పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. పరామర్శించిన వారిలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, వి.సత్యం, పి.చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్, నాయకులు మల్లయ్యయాదవ్, మేకల చంద్రయ్య, మేకల మల్లేష్, బీరం భాస్కర్‌రెడ్డి, బాలింగాచారి, జంగం పెద్దరాజు, బొల్లె ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకుడు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అండెకార్ యాదిలాల్

కల్వకుర్తి, మే 18 : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శనివారం టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ అండెకార్ యాదిలాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, బొకేతో సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని సీఎంను కోరినట్లు యాదిలాల్ పేర్కొన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

అచ్చంపేటటౌన్, మే 18: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి కృష్ణయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారని, రైతులకు ఎరువుల దుకాణదారులు కాలం చెల్లిన విత్తనాలను విక్రయించవద్దన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మవద్దని సూచించారు.

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఉప్పునుంతల, మే 18: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని వెల్టూరు, తిప్పాపూర్ గ్రామంలోని ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు గతంలో మాదిరిగా ప్రభుత్వం పనిముట్లను అందచేయాలన్నారు. ప్రతీ కూలీకి 200 రోజులు పని కల్పించాలన్నారు. ప్రతీ రోజు రూ.600 వేతనం అందించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి వెంటనే జాబ్ కార్డు అందచేయాలన్నారు. కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన కూలీ రూ.300 రావడం లేదన్నారు. ప్రతీ రోజు రూ.180 మించడం లేదన్నారు. వేసవిలో కూలీలకు అలవెన్స్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రహ్లాద్, రవి, సాలయ్య, లింగమయ్య, నారయ్య, శ్రీను, రమేష్, విక్రమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారు

వంగూరు మే 18; మండలంలోని కోనేటిపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సోమ్లాతండా సమీపంలో ఉపాధిహామీ పథకంలో కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 6 కిలోమీటర్ల దూరం నుంచి కాలినడకతో ఇక్కడికి వచ్చి ఉపాధి పనులు చేస్తున్నారని, దీంతో కూలీలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ అధికారులు కూలీల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే పని ప్రదేశానికి వాహన సౌకర్యం కల్పించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తాగునీటి వసతి, మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు. బుచ్చయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించండి

● కోడేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు కనీస వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని సందర్శించి వారి బాగోగులు తెలుసుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అమ్రాబాద్ మే 18: అమ్రాబాద్ మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అమ్రాబాద్ పోలీసులు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. టెలిఫోన్‌లో అపరిచిత వ్యక్తులు బ్యాంకు అకౌంటు నెంబరు, లోన్ సౌకర్యం కల్పిస్తాం.. మీ వివరాలు కావాలి అని అడిగితే ఎటువంటి పరిస్థితుల్లో కూడా వారి మాటలకు మోసపోవద్దని వారు తెలిపారు. అమ్రాబాద్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వాసుదేవ్, వీరయ్య ఉన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

తాడూరు, మే 18 :మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పా టు చేసిన నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా పెంచి పెద్ద చేయాల్సిందిగా ఎంపీడీవో జ్యోతిప రోషియా సూచించారు. శనివారం మండలంలోని చెర్లటిక్యాల, తిర్మలాపూర్, యాదిరెడ్డిపల్లి, తాడూరు తదితర గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. అదేవిధంగా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లో ఉన్న ఒండ్రుమట్టిని పొలాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఏపీవో చంద్రసిద్దార్థ, పంచాయతీ కార్యదర్శు లు, ఆయా గ్రామాల ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.